ప్రజాశక్తి

శనివారం 16 మార్చి 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

నిరసనలో పాల్గొన్న ముస్లిం నాయకులు, సిపిఎం నాయకులు

మతాల పేరుతో

చిచ్చుపెడుతున్న బిజెపి

- ఎన్నికల సమయంలో కుతంత్రాలు..
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి
- సిఎఎ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని నిరసన

ప్రజాశక్తి-బాపట్ల

ఎన్నికల సమయంలో మతాల పేరుతో చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవాలనే బిజెపి కుతంత్రాలను ప్రజాతంత్ర వాదులు ముక్త కంఠంతో వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో బాపట్ల అంజుమన్-ఏ- ఇస్లామియా కమిటీ, సిపిఎం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో రమాదేవి మాట్లాడారు. అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవిస్తున్న హిందూ ముస్లింలను బిజెపి రెండుగా చీల్చే రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. ఎన్నికల ముంగిట సిఏఏ చట్టాన్ని బూచిగా చూపిస్తున్న బిజెపి కుట్రలను భగ్నం చేయాలన్నారు. ఈ చట్టం వల్ల దేశవ్యాప్తంగా మైనార్టీలు నష్టపోతారన్నారు. మైనారిటీల పరిరక్షణ రాజ్యాంగంలో ముఖ్యమైన అంశమన్నారు. బిజెపి రాజ్యాంగాన్ని సైతం తూట్లు పొడుస్తూ ▶ 2లో

దేవాదాయశాఖకు శఠగోపం

- రూ.50 లక్షలకు పైగా లీజు బకాయి చెల్లించకుండానే షాపింగ్‌మాల్ ప్రారంభం
- కోర్టు దృష్టికి తీసుకెళ్తామన్న అధికారులు

షాపింగ్ మాల్ ఇదే..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సామాన్యుడు చిన్న మొత్తంలో ప్రభుత్వ బకాయి ఉన్నా వారి నుంచి అధికారులు ముక్కుపిండి వసూలు చేస్తారు. చెల్లింపుల్లో ఒక్క నెల జాప్యం జరిగినా ఒప్పుకోరు. కానీ చీరాలలో అధికారపార్టీ అండ ఉన్న వారు రెండు సంవత్సరాలుగా దేవాదాయ శాఖకు చెందిన స్థలానికి రూ.50 లక్షల మేర బకాయిలు లీజు చెల్లించకపోయినా అధికారులు పట్టనట్లు వ్యవహరించారు. తీరా లీజు అంశం కోర్టులో ఉండగానే సదరు వ్యక్తులు లీజు స్థలంలో షాపింగ్‌మాల్ నిర్మించి.. ప్రారంభిస్తున్నా పట్టించుకోలేదు.

చీరాల పట్టణ నడిబొడ్డున కూరగాయల మార్కెట్ పక్కన కోదండరామస్వామి ఆలయానికి చెందిన 27 సెంట్ల అతి విలువైన స్థలానికి 2020 నవంబర్‌లో టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించి లీజుకు ఇచ్చారు. ఆ రోజున జరిగిన వేలంలో సదరు స్థలాన్ని నెలకు రూ.1.97 లక్షలు చెల్లించటానికి మాజీ ఎమ్మెల్యే కృష్ణమోహన్ మేనల్లుడు శివప్రసాద్ అత్యధిక బిడ్ కోట్ చేయగా ఆలయ అధికారులు అతనికి టెండర్ ఖరారు చేశారు. స్థలాన్ని లీజుకు అయితే తీసుకున్నారు గానీ అగ్రిమెంట్‌లో దాదాపు 8 నెలల జాప్యం జరిగింది. ఈ కారణంగా దాదాపుగా దేవాదాయశాఖకు ప్రారంభంలోనే రూ.15 లక్షల మేర నష్టం జరిగింది. 2021 ఆగస్టులో 11 ఏళ్ల కాలానికి ఆ స్థలాన్ని లీజుకు తీసుకుంటూ ఒప్పందం చేసుకున్నారు. అప్పటినుంచి నుంచి ప్రతి నెలా ఒప్పందం ప్రకారం నెలవారీ అద్దె రూ.1.97 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉండగా నాలుగు మాసాలు మాత్రమే లీజు చెల్లింపులు చేశారు. ఆ తర్వాత 2021 డిసెంబరు నుంచి 2024 మార్చి వరకు ఒక్క నెల కూడా లీజు మొత్తం చెల్లించలేదు. దీంతో 27 నెలలుగా లీజు బకాయిలు నిలిచిపోయాయి. ఇలా దేవాదాయశాఖకు లీజుదారు చెల్లించాల్సిన మొత్తం రూ.50 లక్షలకు పైబడి నిలిచిపోయింది. గతేడాది జూన్ వరకు చీరాల ప్రాంత ఆలయాలకు మేనేజర్‌గా వ్యక్తి సదరు లీజుదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ లీజు బకాయిల గురించి పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఆలయాల పర్యవేక్షణ అధికారి మారిన అనంతరం నోటీసులు ఇవ్వడంతో తమ మాల్‌కు రెండో వైపు దారి ఇవ్వాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. కానీ వేలం నిర్వహణ, లీజు ఒప్పంద సమయంలో ▶ 2లో

షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న ఆమంచి (ఫైల్)

మార్కాపురంలో ఉత్కంఠ పోరే.!

- వైసిపి, టిడిపి అభ్యర్థులు ఖరారు..
- గత ఎన్నికలకు భిన్నంగా రాజకీయాలు..

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం శాసనసభ నియోజకవర్గంలో త్వరలో జరగనున్న ఎన్నికలకు ప్రధాన రాజకీయ పార్టీలు సన్నద్ధమయ్యాయి. వైసిపి, టిడిపిలు అభ్యర్థులను ప్రకటించాయి. వైసిపి తరపున అన్నా వెంకటరాంబాబు, టిడిపి తరపున కందుల నారాయణరెడ్డి పోటీలో నిలవనున్నారు. ఇక్కడ ఉత్కంఠ పోరే నెలకొంటుందని రాజకీయ పరిశీలకుల అంచనా.!

మార్కాపురం నియోజకవర్గంలో ప్రస్తుతం జరగనున్న పోరు గత ఎన్నికలకు భిన్నంగా ఉండబోతుంది. ప్రధాన పార్టీలు కూడా గతంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను మాత్రమే ఎన్నికల బరిలో నిలిపాయి. ఈ సారి ఎన్నికల్లో మాత్రం భిన్నంగా జరిగింది. వైసిపి టిక్కెట్ ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన అన్నా వెంకటరాంబాబుకు కేటాయించారు. టిడిపి టిక్కెట్ కందుల నారాయణరెడ్డికి ఖరారు చేశారు. కీర్తిశేషులు మాజీ సిఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు సిఎం జగన్‌కు ఇక్కడి ఓ సామాజికవర్గం మెజార్టీగా అనుకూలంగా నడుచుకుంటోంది. వైసిపి ఆవిర్భావం తరువాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ జంకె వెంకటరెడ్డి రూ.10 వేలు, కుందురు నాగార్జునరెడ్డి రూ.18,600 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లోనూ వైసిపి విజయం సాధించేందుకు పావులు కదుపుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలను అటుఇటుగా మార్పు చేసింది. ఇక్కడ పోటీ చేయాల్సిన సిట్టింగ్ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డిని గిద్దలూరు నుంచి బరిలో నిలపనుంది. గిద్దలూరు సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబును మార్కాపురం నుంచి బరిలో నిలిపేందుకు చర్యలు చేపట్టింది. ఆర్యవైశ్యుల్లోని టిడిపి ఓట్లకు గాలం వేసేందుకు వైసిపిలో మార్పు జరిగిందని ప్రచారం జరుగుతోంది. అన్నా వెంకటరాంబాబు కూడా స్థానికుడిగా ఉండటంతో ఆర్యవైశ్యుల్లో మద్దతు కూడగట్టుకుంటున్నారు. టిడిపి నుంచి పోటీ చేయనున్న మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గతంలో ఓడిపోవడం, ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదం.. సానుభూతిని పెంచుతుందనే భావనలో ఉన్నారు. ఆర్యవైశ్య సామాజికవర్గం కూడా ఆదరిస్తుందనే భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో రెడ్డి సామాజికవర్గంలో కందుల నారాయణరెడ్డి తనను ప్రత్యేకంగా చూడాలని కోరుతున్నట్లు తెలిసింది. మొత్తానికి మార్కాపురంలో వైసిపి అభ్యర్థిగా అన్నా వెంకటరాంబాబు, టిడిపి అభ్యర్థిగా కందుల నారాయణరెడ్డి ఈ సారి ఎన్నికల్లో తలపడటం ఖాయమనే చెప్పాలి. మార్కాపురంలో ఉత్కంఠ పోరు జరగనుందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

లంచం అడిగారని..

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన గ్రామస్తులు
- తన భార్యకు అంగన్‌వాడీ పోస్టు కోసం పీడీ రూ.లక్ష అడిగారని బాధితుడి ఆరోపణ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

తన భార్యకు అంగన్‌వాడీ పోస్టు కోసం అధికారులు లంచం అడిగారని ఆమె భర్త ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలోని పెదపులివర్రు పంచాయతీలో గల కోళ్లపాలెంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇటీవల అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టు ఖాళీ కాగా దానిని భర్తీ చేసేందుకు సంబంధిత అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. దీన్ని అనుసరించి గ్రామానికి చెందిన జల్లి కవిత ఆయా పోస్టు కోసం అమర్తలూరు సిడిపిఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని రు.లక్ష ఇస్తేనే ఆయా పోస్ట్ వస్తుందని, లేకపోతే పోస్ట్ ఇచ్చేదే లేదని చెప్పడంతో మనస్తాపానికి గురైన కవిత భర్త సాల్మన్ శుక్రవారం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. సమీపంలో ఉన్న గ్రామస్తులు చూసి అతనిని రక్షించారు. సిడిపిఓను ఆయా పోస్ట్ గురించి ఫోన్ ద్వారా అడగగా మీ పోస్టు బాపట్ల పీడీ ఆపమని చెప్పారని, ఏమైనా వివరాలు కావాలంటే పీడీని అడిగి తెలుసుకోండని చెప్పినట్లు సాల్మన్ పేర్కొన్నారు. దీంతో పీడీని కలవగా ఆయా పోస్ట్ ఊరకే వస్తుందా? రూ.లక్ష ఇస్తేనే పోస్ట్ ఇస్తామని, లేదంటే ఇచ్చేది లేదని తెగేసి చెప్పారని, ఎవరి చేతనైనా ఫోన్లు చేపిస్తే పోస్ట్ ఇచ్చేదే లేదన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము పేదవాళ్లమని, అంత డబ్బు ఇచ్చుకోలేమని.. పోస్టు రాదని.. మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించినట్లు చెప్పారు.

ఆత్మహత్యకు యత్నించిన సాల్మన్‌ను రక్షిస్తున్న గ్రామస్తులు

దేవదాయ శాఖకు శఠగోపం

(మొదటిపేజీ తరువాయి)

ఆ స్థలానికి వెనక వైపున ఉన్న మున్సిపల్ ఆక్రమణలు తొలగించాలని లీజుదారు కోరలేదు. లీజు బకాయిలు చెల్లించటం లేదని నోటీసులు పంపితే మున్సిపల్ ఆక్రమణలు తొలగించకుండా దేవదాయశాఖ అధికారులు తనను ఇబ్బంది పెడుతున్నారని లీజుదారు కోర్టును ఆశ్రయించారు. దానికి దేవదాయశాఖ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. 'ఖాళీ స్థలంలో విశాలమైన మాల్ నిర్మాణం చేపట్టారు. నాలుగు మాసాలు అద్దె మాత్రమే చెల్లించారు. ఆ తర్వాత మున్సిపల్ ఆక్రమనలు తొలగించాలని పేచీ పెట్టారు. ఆ ఆక్రమణలు మా స్థలంలో లేవు.. అవి మున్సిపల్ రోడ్డు పక్కన ఉన్నాయి.. ఆ ఆక్రమణలు తొలగించే బాధ్యత మున్సిపాలిటీకే ఉంటుంది. అది మా పరిధి కాదు' అని కౌంటర్‌లో హైకోర్టుకు దేవదాయశాఖ అధికారులు నివేదించారు. లీజుదారు పూర్తిస్థాయిలో భవనాన్ని నిర్మించారని ఫొటోలతో సహా హైకోర్టుకు అందజేశారు. ఇది కోర్టు పరిశీలనలో ఉంది. దీనిపై కోర్టు నుంచి ఎలాంటి తీర్పు రాలేదు. కానీ లీజుదారు మాత్రం తాను చెల్లించాల్సిన లీజు బకాయిలు మొత్తాన్ని వాయిదాల రూపంలో చెల్లింపులు చేస్తానని దేవదాయశాఖ కమిషనర్‌కు ఓ అర్జీపెట్టుకున్నారు. దీనిపై దేవదాయ శాఖ అధికారులు స్పందిస్తూ లీజు రుసుం వెంటనే చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. లీజు బకాయిల అంశం కోర్టులో ఉంది. దేవదాయశాఖ కమిషనర్ బకాయిల విషయమై ఎలాంటి మినహాయింపులూ ఇచ్చిన దాఖలాలు లేవు. గురువారం సదరు షాపింగ్ మాల్‌ను చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ప్రారంభించారు.

కోర్టు దృష్టికి తీసుకెళతాం..

ఈ విషయమై జిల్లా దేవదాయ శాఖ అధికారి పానకాలరావును 'ప్రజాశక్తి' వివరణ కోరగా.. లీజుదారు తమ శాఖకు రూ.50 లక్షల మేర లీజు బకాయిలు ఉన్నట్లు స్పష్టం చేశారు. నోటీసులు ఇచ్చామని లీజుదారు కోర్డుకు వెళ్లారని, లీజు బకాయిల అంశం కోర్టులో ఉండగానే వారు షాపింగ్ మాల్ ను ప్రారంభించారని చెప్పారు. ఈ విషయం గురించి కూడా తమ లాయర్ ద్వారా కోర్టు దృష్టికి తీసుకెళ్లామన్నారు.

మతాల పేరుతో చిచ్చు పెడుతున్న బిజెపి

(మొదటిపేజీ తరువాయి)

మైనారిటీలైన ముస్లిములను, క్రైస్తవులను సిఎఎ బూచిగా చూపుతూ వారి జీవితాలతో ఆటలాడుతోందన్నారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోకపోతే ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పౌరసత్వ చట్ట సవరణ రద్దుపై రాష్ట్రంలో టిడిపి, వైసిపి నాయకులు స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఇప్పటికే కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఈ చట్టాన్ని వ్యతిరేకించాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ మైనారిటీల పరిరక్షణ కోసం సిపిఎం రాజీ లేని పోరాటం చేస్తోందన్నారు. మైనారిటీలను రక్షించడం, సంరక్షించడం ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలన్నారు. 'ప్రజాశక్తి' ప్రచురించిన 'సిఎఎను వ్యతిరేకిద్దాం' ప్రత్యేక సంచికను చూపుతూ ముస్లిములు బిజెపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్, శరత్, సుభాషిణి, నూర్‌బాషా సంఘం నాయకులు ఎల్.సిద్దయ్య, అంజుమన్ ఇస్లామీయా కమిటీ అధ్యక్షులు అబ్దుల్ కరీం జానీ, కార్యదర్శి అబ్దుల్ కరీం, మాజీ అధ్యక్షులు జిలానీ, ఆదర్శ డిగ్రీ కళాశాల అధినేత నజీర్, పెద్ద సంఖ్యలో ముస్లిములు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాగార్జున

మండల కేంద్రమైన సంతనూతలపాడులో సుమారు 4 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున శుక్రవారం ప్రారంభించారు. స్థానిక హైస్కూల్ సమీపంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ ఇండోర్ స్టేడియాన్ని, సిండికేట్ రైతు సేవా సహకార సంఘ భవనాన్ని, ఎన్ఆర్ఈజీఎస్ భవనాన్ని, రీ మోడలింగ్ చేసిన విద్యుత్ శాఖ కార్యాలయాన్ని, వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని, వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయాన్ని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నూతనంగా నిర్మించిన ముఖద్వారాన్ని మంత్రి నాగార్జున ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, ఏఎంసి చైర్మన్ మారెళ్ల బంగారు బాబు, ఎంపీపీ బి విజయ, జడ్పిటిసి దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి, సొసైటీ చైర్‌పర్సన్ దుంపా యలమందారెడ్డి, వైస్ ఎంపీపీ టి రాగమ్మ, ఎంపిటిసి బి సుబ్బారావు, డిఎల్‌డిఓ రాజరాజేశ్వరి, మండల స్పెషల్ ఆఫీసర్ ఉషారాణి, ఈఓఆర్‌డి జి రామకృష్ణ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డిఎస్‌వి ప్రసాద్, ఏపిఎం బి సుధాకరరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్రైడే' కార్యక్రమంలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-కనిగిరి

దోమలు వ్యాప్తి చెందకుండా నిరోధించేందుకు ఇంటింటికీ వెళ్లి ఫ్రైడే కార్యక్రమాన్ని నిరంతరం పాటించాల్సిన ప్రాముఖ్యత ఉందని కనిగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 7వ వార్డు కొత్తూరులో సచివాలయం ఆరోగ్య సిబ్బంది చేపట్టిన ఫ్రైడే కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు పాల్గొని పలు గృహాలను సందర్శించి గృహంలోని వారికి దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కనిగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ మురుగునీరు నిల్వ ఉన్న కూలర్లు, తొట్లు, పాతబడిన టైర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలకు తెలియజేశారు. మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో లార్వా వృద్ధి చెందుతాయని, ఆ ప్రాంతాల్లో

పరిసరాలు పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు

ఆయిల్ బాల్స్‌ను ఆశా కార్యకర్తలచే వేయించారు. ఇలా చేయడం వల్ల డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా తదితర ప్రాణాంతకరమైన వ్యాధుల నుంచి రక్షించుకునే అవకాశం ఉందన్నారు. కనుక ప్రతి ఒక్కరూ దోమ తెరల మెష్‌లు వాడాలని ఆయన అన్నారు. హెల్త్ సెక్రెటరీ ఉమా, ఆశా వర్కర్లు మరియమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఈఈ విఫలం

నల్ల బ్యాడ్జీలతో విద్యుత్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మార్కాపురం డివిజన్ పరిధిలోని విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించంలో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి నాగేశ్వరరావు విఫలమయ్యారని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు కె మల్లికార్జునరావు, సిహెచ్ రవికాంత్ అన్నారు. శుక్రవారం యర్రగొండపాలెం సబ్ స్టేషన్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల ప్రధాన సమస్యలు పలు పర్యాయాలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇటీవల జరిగిన పరిణామాలలో భాగంగా సబ్ స్టేషన్ సిబ్బందిని డిస్ట్రిబ్యూషన్‌లకు కేటాయించడంలో ఒక యూనియన్ సభ్యులకు మాత్రమే ఉద్దేశపూర్వకంగానే వారు అడిగిన చోట సిబ్బంది అవసరం లేకపోయినా కేటాయించడంపై ధ్వజమెత్తారు. ఇటీవల ఇచ్చిన అక్రమ డిప్యూటేషన్‌ల ఆర్డర్‌లను రద్దు చేయాలని అన్నారు. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మార్కాపురం డివిజన్ ఆఫీసులో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనలు తెలుపుతామని చెప్పారు. 21 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

చేయూత చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

చేయూత చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి నాగార్జున

స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ చేయూత చెక్కులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున పంపిణీ చేశారు. వైఎస్సార్ చేయూత పథకం కింద సంతనూతలపాడు మండల పరిధిలో 2,370 మందికి 4 కోట్ల 44 లక్షల 37 వేల 500 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం కింద 18,750/- ప్రతి మహిళకు 4 విడతలలో 75 వేల రూపాయలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం జగనన్న ఇంటి పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, వైసిపి మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ దుంపా యలమందారెడ్డి, జడ్పిటిసి దుంపా రమణమ్మ, ఎంపీపీ బుడంగుంట విజయ, సర్పంచ్ దర్శి నాగమణి, ఎంపీటీసీలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వీఓఏలు పాల్గొన్నారు.

ఓటరుకు అవగాహన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటరు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ ఎన్ శ్రీనివాసాచార్యులు, డాక్టర్ నాగరాజు, అక్రం, రమేష్, హార్లీ, జయరాజు, రాజేష్, కృష్ణారెడ్డి, నరసింహారాజు, రమణారెడ్డి, యల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ ఒంగోలు కాపురస్థురాలు రాచపూడి శ్రీ కృష్ణ గారి భార్య లక్ష్మి అనసూయ అను వారు మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు తెలియ జేయునది ఏమనగా.

మా క్లయింట్ 8443/10.11.2006 ది గల విక్రయ దస్తావేజు ద్వారా ఆస్తిని కొనుగోలు చేసుకొని సదరు డాక్యుమెంటు కు లింకు డాక్యుమెంట్ అయిన 2992/27.7.1993 ది గల శ్రీకంఠ విజయలక్ష్మి పేరుతో నూతలపాటి పట్టాభి రామలక్ష్మి ఆమె కుమారులు ఆది రాజారావు, వెంకట సుబ్రహ్మణ్యం, వెంకట నాగేశ్వరరావు అను వారలు విక్రయించిన లింకు దస్తావేజు 29-02-2024 దిన నా క్లయింట్ జెరాక్స్ తీయించుకుని వచ్చుచుండగా ముంగమూరు రోడ్ జంక్షన్ వద్ద పోయినది. పోలీసు రిపోర్ట్ సహా ఇచ్చియున్నది. సదరు ఆస్థి పై నా క్లయింట్ బ్యాంకు లోన్ తీసుకొనుచున్నది. ఎవరికైనా ఎలాంటి క్లైములు గాని, ఆక్షేపణలు గాని ఉన్న ఎడల ఈరోజునుండి వారం రోజులలోపల తెలియపరచేది.

సీతారామపురం — **ఇట్లు**
ఒంగోలు. — **ముదివర్తి రాఘవరావు,**
తేదీ:15-3-2024 — **పెళ్ళూరి వసుంధర,**
అడ్వొకేట్స్,ఒంగోలు.

నోటీసు

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EA No : 82/22
IN
EA No :112/19
IN
EP No : 94/15
IN
OS No : 58/12

పెంట్యాల శ్రీనివాసరావు
.....పిటీషనర్/3RD PORTY
V/s
గంధం పార్థసారథి మరియు ఒకరు
.... రెస్పాండెంట్లు/DHR,JDR

To
1వ రెస్పాండెంట్
గంధం పార్థసారథి S/o GAR గోపాలకృష్ణ,
అద్దంకి పట్టణం, మరియు అద్దంకి మండలం,
బాపట్ల జిల్లా, Cell No : 9866677200

పై నంబరు పిటీషనను పిటీషనరు దాఖలు చేసినందున ఇందు విషయమై నీకు ఆక్షేపణలున్నచో ది:28-03-2024న ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై నీ యొక్క ఆక్షేపణలు మనవి చేసుకొనవలసినది. లేని యెడల సదరు విషయమై నీపరోక్షమున విచారించి తీర్మానం చేయుదరని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

అద్దంకి:
14-03-24

J.రామచంద్రరావు, B.Com, BL
పిటీషనరు తరపు అడ్వకేట్

ముఖ్య కార్యకర్తలతో కుందురు సమావేశం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రణాళికలపై గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె ముండ్లపాడు పంచాయతీల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో గిద్దలూరు వైసిపి ఇన్‌ఛార్జి కుందురు నాగార్జునరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ యర్రం వెంకటరామిరెడ్డి సమావేశమయ్యారు. రెండు పంచాయతీల ముఖ్య నాయకులు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలతో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన

సూచనలు ఇస్తున్న నాగార్జునరెడ్డి, వెంకటరామిరెడ్డి

వ్యూహంపై సుదీర్ఘ చర్చలు జరిపారు. నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.

మహాజన సభ సమావేశపు నోటీసు

ఇందుమూలముగా ది వీరభద్రాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ రిజిష్టర్ నెం. **OA 238** వీరభద్రాపురం, యర్రగొండపాలెం మండలం యొక్క సంఘ సభ్యులందరికీ తెలియచేయునది ఏమనగా మన సంఘమునకు చెందిన క్రింద పేర్కొనిన ఎజెండాలోని వివిధ అంశములు మీద చర్చించుటకు తేది 30-03-2024 శనివారము ఉదయం 11.00 గంటలకు సంఘ ఆవరణలో జరుగబోవు మహాజన సభ సమావేశమునకు తప్పక హాజరు కావలసినదిగా కోరడమైనది.

ఎజెండా :

1. సంఘమునకు సంబంధించిన లాభ, నష్టముల ఖాతా
2. సంఘములో ఉన్నటువంటి అన్ని రకముల వాయిదామీరిన అప్పుల గురించి
3. అక్టోబరు-2023 నుండి మార్చి-2024 వరకు జరిగినటువంటి త్రిసభ్య కమిటీ సమావేశము గురించి
4. సంఘ ఛైర్ పర్సన్ గారి ఆదేశాల ప్రకారం ఇతర విషయములు చర్చించి ఆమోదించుట
5. మన సంఘంలో రూ.10/- ప్రవేశ రుసుము కలిగినవారు 30.03.2024లోపు షేరు ధనము రూ.300/-లు చెల్లించగలరు. అట్లు చెల్లించని ఎడల సభ్యత్వం రద్దు చేయుటకు చట్టరీత్యా తగు చర్యలు తీసుకొనబడును.

ఇట్లు : పునుగోటి వెంకటేశ్వరరెడ్డి గారు, ఛైర్ పర్సన్, ది వీరభద్రాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ రిజిష్టర్ నెం. OA 238 వీరభద్రాపురం, యర్రగొండపాలెం మండలం.

అంగన్‌వాడీలకు ప్రమోషన్లు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-మద్దిపాడు

అర్హత కలిగిన అంగన్‌వాడీ ఆయాలకు వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల ఆయాలకు ప్రమోషన్లు ఇవ్వాలని మద్దిపాడులో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి ఐదోరోజుకు చేరాయి. ఈ దీక్షలకు కాలం సుబ్బారావు ప్రారంభించి మాట్లాడారు. గత ఐదు రోజులుగా తమకు ప్రమోషన్స్ ఇవ్వాలని అంగన్‌వాడీలు దీక్షలు చేస్తున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. తక్షణమే వారికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ దీక్షలలో సిఐటియు నాయకులు ఉబ్బా ఆదిలక్ష్మి , అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి ధనలక్ష్మి, అంగన్‌వాడీలు గోవిందమ్మ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు

మంత్రి వాఖ్యలకు ఖండన

తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అంగనాడీల ప్రమోషన్స్ గురించి చూస్తామని మంత్రి చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు తెలిపారు. సంతనూతలపాడు మండలం గుమ్మనంపాడు పంచాయతీ పరిధిలోని బొడ్డపాటివారి పాలెంలో అంగన్‌వాడీ ఆయాగా పని చేస్తున్న గంగవరపు గోవిందమ్మకు ప్రమోషన్ ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చినా రాజకీయ ఒత్తిళ్ల నేపథ్యంలో అధికారులు ప్రమోషన్ కల్పించలేదన్నారు. కోర్టు ఉత్తర్వులు ఇచ్చి మూడేళ్లయిన ఇంతవరకు ప్రమోషన్ ఇవ్వలేదన్నారు. గత్యంతరం లేక మంత్రి, వైసిపి సంతనూతలపాడు నియోజక వర్గ ఇన్‌ఛార్జి మేరుగు నాగార్జునను గోవిందమ్మ, యూనియన్ నాయకులు కలవగా తాను ఎమ్మెల్యేగా అయిన తర్వాత చూస్తానని చెప్పడం బాధాకరమని తెలిపారు. మంత్రిగా ఉండి కోర్టు తీర్పును అమలు జరపని అధికారులపై చర్యలు తీసుకోకపోగా ఈ రకంగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోను కాకుండా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. అదేవిధంగా నేలటూరు గ్రామంలోనూ అంగన్‌వాడీ ఆయాకు ప్రమోషన్ ఇచ్చి సహకరించాలని డిమాండ్ చేశారు.

'పది' పరీక్షలకు 609 మంది

కొండపి : ఈనెల 18 నుంచి నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్షలకు కొండపి మండలంలో మొత్తం 609 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఎంఇఒలు కె.సురేఖ, రామారావు తెలిపారు. కొండపి మండలంలో ఆరు జడ్‌పిహెచ్‌స్కూళ్లు, నాలుగు ప్రైవేటు పాఠశాలలు, ఒకు గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో 296 మంది బాలురు, 313 మంది బాలికలు కలిపి మొత్తం 609 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. కొండపి గురుకుల పాఠశాల నుంచి 78 మంది బాలికలు, కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 49 మంది బాలురు, 47 మంది బాలికలు, కె.ఉప్పలపాడు జడ్‌పిహెచ్‌ఎస్‌లో 12 మంది బాలురు, 17 మంది బాలికలు, ముప్పవరం స్కూల్‌లో 8 మంది బాలురు, 11 మంది బాలికలు, నేతివారిపాలెం స్కూల్‌లో 9 మంది బాలురు, 12 మంది బాలికలు, పెదకండ్లగుంట స్కూల్‌లో 16 మంది బాలురు, 15 మంది బాలికలు, పెట్లూరు స్కూల్‌లో 10 మంది బాలురు, 9 మంది బాలికలు, వెన్నూరు లో 25 మంది బాలురు, 17 మంది బాలికలు,చ హ్యాపీ కిడ్స్ స్కూల్‌లో 28 మంది బాలురు, 5 గురు బాలికలు, పాపారావు స్కూల్‌లో 56 మంది బాలురు, 29 మంది బాలికలు, శాంతినికేతన్ స్కూల్‌లో 31 మంది బాలురు, 28 మంది బాలికలు, శ్రీ సహజానంద స్కూల్‌లో 52 మంది బాలురు, 45 మంది బాలికలు పరీక్షలకుహాజరు కానున్నట్లు వారు తెలిపారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-టంగుటూరు

విద్యా హక్కు చట్టం-2009, ఆర్‌టిఇ 12-16 ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో అనాథలు, వికలాంగులు , షెడ్యూల్ కులాలు, తెగలు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులకు 1వ తరగతిలో 25శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తున్నట్లు టంగుటూరు-2 ఎంఇఒ తన్నీరు బాలాజీ శుక్రవారం తెలిపారు. అందుకోసం ఈనెల 5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాల ల్లో1వ తరగతిలో ఉచిత సీట్లు పొందుటకు ఆసక్తి కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ, వార్డు సచివాలయాలు, నెట్ సెంటర్లు, మీ సేవా సెంటర్ల ద్వారా మరియు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈనెల 25 లోపు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మండలంలో మొత్త 57 సీట్లు ఖాళీ ఉండగా ఇప్పటివరకు కేవలం 20 సీట్లకు మాత్రమే ఆన్ లైన్‌లో దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థుల తల్లి దండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నాగులుప్పలపాడు: విద్యాహక్కు చట్టం ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి, ఆర్థికంగా వెనకబడిన మైనారీటీలు, బీసీ, ఒసి విద్యార్థులు ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి చదవడానికి ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎంఇఒలు టి. రవికుమార్, ఐవి. రమణయ్య తెలిపారు. అర్హులైన వారు ఈనెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్‌టిసి బస్సులో మందుబాబు వీరంగం

- మహిళా కండక్టర్‌పై దాడి
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు

ప్రజాశక్తి-పొదిలి

మద్యం మత్తులో ఓ యువకుడు ఆర్‌టిసి మహిళా కండక్టర్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన పొదిలిలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... పొదిలి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సులో పొదిలి వచ్చేందుకు కనిగిరి వద్ద ఓ యువకుడు ఎక్కాడు. బస్సు పొదిలి వచ్చిన తర్వాత ఆ యువకుడు ఎంతకీ బస్సు దిగలేదు. దీంతో కండక్టర్ బస్సు దిగాలని ఆ యువకుడికి చెప్పింది. మద్యం మత్తులో ఉన్న యువకుడు కండక్టర్‌ను అసభ్యంగా దూషించాడు.

పోలీసులు అదుపులోకి తీసుకున్న మందుబాబు

అనంతరం ఆమెపై దాడి చేశాడు. దీంతో బస్సులోని ప్రయాణికులు యువకుడిని అడ్డుకున్నారు. అనంతరం ప్రయాణికులు, ఆర్‌టిసి సిబ్బంది ఆ యువకుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.కండక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పచ్చాకు కూలీగా మంత్రి సురేష్

శింగరాయకొండ : మంత్రి సురేష్ పచ్చాకు కూలీగా అవతారమెత్తాడు. జరుగుమల్లి మండలం పంగులూరి వారి పాలెంకు చెందిన వైసిపి సీనియర్ నాయకుడు పిన్నిక్కి శ్రీనివాసరావును కలిసేందుకు మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లారు. శ్రీనివాసరావు ఇంటికి వెళుతున్న సమయంలో మంత్రికి పొగాకు బ్యారెన్లు కనిపించాయి. అక్కడ కూలీలు కర్రలకు పొగాకు అల్లుతున్నారు. దీంతో మంత్రి అక్కడికి వెళ్లి వారితో మాటలు కలిపారు. వారి సారక బాధలు అడిగి తెలుసుకున్నారు. తాను కూడా మీతో కలిసి పోతానని చెప్పారు. అనంతరం కాసేపు పచ్చాకు అల్లారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరికి న్యాయం చేశారని వివరించారు. మంత్రి అల్లికను చూసిన వారంతా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

పొగాకు అల్లికలో మంత్రి సురేష్

పేదల సంక్షేమమే ధ్యేయం : బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకయమ్మ, వైసిపి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. దర్శి నగర పంచాయతీలోని 16వ వార్డులో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం సిఎం అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. తొలుత పొట్టి శ్రీరాములు, గాంధీ, వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంకాల నాగయ్య, కొల్లా ఉదయ భాస్కర్, వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కట్టెకోట హరీష్, పాల్గొన్నారు. అనంతరం మండలంలోని తూర్పు వెంకటాపురం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మానికొండ వెంకయ్య, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

స్థల వివాదంలో 20 మంది బైండోవర్

ప్రజాశక్తి-కొండపి

స్థల వివాదంలో ఇరు గ్రూపులపై పోలీసులు బైండవర్ కేసు నమోదు చేశారు. కొండపి ఎస్ఐ య.కృష్ణ బాజి కథనం ప్రకారం... కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో నాగారప్పమ్మ గుడి తూర్పు వైపున ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో శాలివాహన సంఘం వారు కమ్యూనిటీహాలు నిర్మించేందుకు ప్రయత్నించారు. ముస్లింలు ఆ స్థలం తమ శ్మశాన వాటికకు సంబంధించిన స్థలమని చెప్పారు. దీంతో వారి మధ్య వాదనలు జరిగాయి. చివరకూ పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఎస్ఐ ఆస్థలం ఎవరిదో తేలే వరకూ అక్కడకు ఎవరూ వెళ్లరాదంటూ ఇరు గ్రూపులకు చెందిన 20 మందిపై బైండవర్ కేసు నమోదు చేశారు.

సిద్ధం సభకెళ్లిన బాలుడు అదృశ్యం

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

ప్రజాశక్తి-రాచర్ల

బాపట్ల జిల్లా మేదరమెట్ల వద్ద నిర్వహించిన సిద్ధం సభకు వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అందిన వివరాల ప్రకారం... రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన సూరా రమణారెడ్డి అనే బాలుడు ఈ నెల 10న మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభకు వెళ్లాడు. అప్పటి నుంచి బాలుడి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాలుడి తండ్రి స్వామిరెడ్డి మేదరమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాలుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-పుల్లలచెరువు

ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మండల పరిధిలోని చాపల మడుగు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మి ప్రసన్న (28) అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకొని చనిపోయింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు.

లారీలు ఢీకొని యువకుడు మృతి

టంగుటూరు : ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మినీ లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. మరో యువకుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఈఘటన మండల వల్లూరు గ్రామం వద్ద జాతీయ రహదారి శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒంగోలు మదర్ థెరిసా కాలనీకి చెందిన షేక్ కమురుద్దీన్ (22) అనే యువకుడు మృతిచెందాడు. వెంకటేశ్వర కాలనీకి చెందిన మాదాల బాలాజీ తీవ్రంగా గాయపడ్డాడు. టంగుటూరు పోలీసుల కథనం ప్రకారం.. ముందు వెళ్తున్న లారీని, మినీ ఢీకొంది. దీంతో షేక్ కమురుద్దీన్ అక్కడికక్కడే మృతిచెందాడు.మృతుడు కొన్ని నెలలుగా ఓ ప్రైవేటు కంపెనీలో డెలివరీ బాయ్ గా పని చేస్తున్నాడు.ఈ క్రమంలో కందుకూరులో పని ముగించుకుని ఒంగోలు తిరిగి వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. టంగుటూరు ఎస్ఐ నాగేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని ఒంగోలు తరలించారు. కమురుద్దీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కొండపి

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కొండపి గ్రామ తెలుగు యువత నాయకులు దేపూరి మస్తాన్, బ్రహ్మానందం తెలిపారు. కొండపిలో ఇంటింటి ప్రచారం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

15 క్వింటాళ్ల మిర్చి చోరీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామం చెక్కల వాగు రోడ్డులో శుక్రవారం తెల్లవారు జామున పొలంలో ఆరబెట్టిన 15క్వింటాళ్ల మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని గ్రామానికి చెందిన బాదిత కౌలు రైతు వల్లెం వెంకటరావు తెలిపారు. వెంకటరావు వివరాల ప్రకారం ఎకరం న్నరమెట్ట పొలాన్ని కౌలుకు తీసుకుని మిర్చి తేజ రకం పంటను సాగు చేసినట్లు తెలిపారు. రెండు కోతల్లో వచ్చిన 15క్వింటాళ్ల మిర్చిని పొలంలోని కల్లంలో ఆరబెట్టాడు. శుక్రవారం తెల్లవారు జామున 2గంటల సమయం వరకు పొలంలోనే కాపలా ఉన్నాడు. ఆరబెట్టిన మిర్చి ఎక్కడికి పోతుందిలే అని పొలం నుండి ఇంటికి చేరాడు. తిరిగి వెంకటరావు ఉదయాన్నే లేచి పొలం వద్దకు వెళ్లి చూడగా ఆరబెట్టిన మిర్చి కనిపించకపోవడంతో చోరీ జరిగిందని వాపోయాడు. రెండున్నర లక్షల రూపాయలు వరకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ15 క్వింటాళ్ల మిర్చి కోయడానికి

కళ్లంలో ఆరబెట్టిన మిర్చి పంట

కూలీలకు రూ.50వేలకు పైగా ఖర్చు అయిందని తెలిపారు. ఇప్పుడున్న మార్కెట్ ప్రకారం రెండున్నర లక్షల విలువై ఉంటుందన్నారు. అలాగే ఇటీవల కొప్పరం గ్రామానికి చెందిన రైతు కి కూడా పొలంలో ఆరబెట్టిన మిర్చి చోరీకి గురైందని గుర్తు చేశారు. వరుస మిర్చి చోరీలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అవినీతిపాలన అంతమే లక్ష్యం

ప్రజాశక్తి - రేపల్లె

రాష్ట్రంలో ఉన్న అరాచక, అవినీతి పాలనను తుదముట్టించేందుకు టిడిపి, జనసేన, బిజేపి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాస్ కోరారు. స్థానిక టిడిపి కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెప్పి చరమగీతం పాడాలని అన్నారు. ఈ నెల 17న ఆదివారం చిలకలూరిపేటలో ప్రధాని నరేంద్ర మోడీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజగళం సభను విజయవంతం చేయాలని కోరారు. టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రయోజనాల కోసం బిజేపితో పొత్తు పెట్టుకున్నారని అన్నారు. కూటమిగా ఏర్పడి సైకో పాలనపై యుద్ధం చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన,

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు

బిజేపి బలపర్చిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను కూటమి సైనికులు నిరంతరం ప్రజల్లోకి వెళ్లి ఎండగట్టాలని అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మతి భాస్కరరావు, బిజెపి నాయకులు సాంబశివరావు, టిడిపి నాయకులు జీవి నాగేశ్వరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షల్లో స్థానిక ఆదర్శ, శ్రీ సాయిరామ విద్యార్థులు 10మంది ప్రతిభ కనబరిచారు. వీరిని జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ అభినందించారు. చిన్ననాటి నుండే పోటీపరీక్షలకు తర్ఫీదునిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్‌ను జెసి అభినందించారు. శ్రీసాయిరామ పాఠశాలకు చెందిన రసజ్ఞ 186 మార్కులు, ఆదర్శ హైస్కూలుకు చెందిన హేమ ఆనంది 168, హరిచందన 160, జాహ్నవి 139, మేఘన 138, రామ్ వర్ధన్ 128, భగీరథ్ నాయక్ 120 మార్కులు సాధించారని

బాపట్లలో జెసిని కలిసిన ఆదర్శ, శ్రీ సాయిరామ విద్యార్థులు

కరస్పాండెంట్ తోటకూర విజయ భాస్కర్ జెసికి వివరించారు.

ఎన్నికలకు సమాయత్తం కండి

ప్రజాశక్తి - పర్చూరు

నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, బాపట్ల ఆర్‌డిఒ జి రవీందర్ అధ్యక్షతన రాబోవు ఎన్నికలు సక్రమమైన నిర్వహణకు నియమించిన సెక్టార్ అధికారులు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారులు, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, బిఎల్‌ఒకు స్థానిక అద్దంకి నాంచరమ్మ కల్యాణ మండపంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఈవీఎం, వివిపిటిల పని విధానం గురించి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని తెలిపారు. అసాంఘిక చర్యలకు తావు లేకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయాని తెలిపారు. స్థానిక కూనపురెడ్డి ప్రమిలారాణి డిగ్రీ కాలేజీలో ఎన్నికల కమిటీల శిక్షణ నిర్వహించారు. శిక్షణలో ఆర్‌డిఒ రవీంధర్ మాట్లాడారు. రాబోవు ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలని కోరారు. వివిధ యాప్‌లను

అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌డిఒ రవీందర్

వివరించారు. రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా ఎన్నికల విదులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పర్చూరు ఎఇఆర్‌ఒ సిహెచ్ సుబ్బయ్య, మార్టూరు ఎఇఆర్‌ఒ కె సంధ్యశ్రీ, యద్దనపూడి ఎఇఆర్‌ఒ వై నాగరాజు, కారంచేడు ఎఇఆర్‌ఒ మెహర్ బాబు, ఇంకొల్లు ఎఇఆర్‌ఒ ఎం ప్రమీల, చిన్నగంజాం ఎఇఆర్‌ఒ జివిఎస్ ఫణింద్ర బాబు, పర్చూరు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఇంకొల్లు ఎంపీడీఓ శ్రీదేవి, చిన్నగంజాం ఎంపీడీఓ వరప్రసాద్, కారంచేడు ఎంపీడీఓ బాబురావు, యద్దనపూడి ఎంపీడీఓ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న రఘుపతి

విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - బాపట్ల

పెరుగుతున్న విద్యుత్ అవసరాల దృష్ట్యా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సెమీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఎల్‌ఎ కోన రఘుపతి అన్నారు. పట్టణంలోని తహశీల్దారు కార్యాలయం వద్ద రూ.8.50కోట్ల వ్యయంతో నిర్మించనున్న సెమీ ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాగా బాపట్ల ఏర్పడిన నేపథ్యంలో ప్రజలకు విద్యుత్ అవసరాలు తీర్చి నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు ఈ సబ్ స్టేషన్ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. సెమి ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రంతో ఏరియా వైద్యశాలకు ప్రత్యేక లైన్ నిర్మాణం, కలెక్టరేట్‌కు ప్రత్యేక 11కెవి లైన్ నిర్మాణం ఏర్పడుతుందని అన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఇఇ గువ్వల ఆంజనేయులు, డిఈఈ బి హరి ప్రసాదరావు, పట్టణ ఎఈ పెరుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులకు వివరిస్తున్న మాస్టర్ ట్రైనర్ అప్పారావు

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - పర్చూరు

వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, ఇంకొల్లు, కారంచెడు, యద్దనపూడి మండలాల మహిళా సమాఖ్యల కృషిసఖిలకు ప్రకృతి వ్యవసాయంపై వంకాయలపాడు రైతుభరిసా కేంద్రంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. నేలను సారవంతం చేయడానికి అవసరమైన పద్ధతులు పాటించాలని చెప్పారు. నీటి యాజమాన్యం, తక్కువ నీటితో పంటలు ఎలా పండించ వచ్చునో వివరించారు. పురుగులు, తెగుళ్లను సహజ వనరులతో నివారించే పద్ధతి తెలిపారు. బహుళ పంటలు, అంతర పంటలు వేయటం వలన లాభాలు వస్తాయని తెలిపారు. ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్, డ్రాట్ ప్రూఫింగ్ మోడల్ వలన రైతులకు లాభాలు ఉంటాయని తెలిపారు. నాటు విత్తనాలు వాడడం వలన ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. పండించిన పంటల వలన ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. నాన్య మైన దిగుబడులు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సిహెచ్ అప్పారావు, అడిషనల్ డిపిఎం మోహన్, ఎల్2 వెంకట స్వామి, ఐసిఆర్‌పిఎస్ కృషి సఖిలు జి సుబాషిని, ఆర్ సుమలత, ఎం లలిత కుమారి, సిహెచ్ సుశీల, కె రాధ, కె ఉషారాణి, పి వెంకటరత్నం పాల్గొన్నారు.

'కెజిబివి' దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల్లో 2024- 25 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్మీడియట్ ఎంఈసి గ్రూపులకు ఈనెల 12నుండి వచ్చే నెల 11వరకు దరఖాస్తు చేసుకోవచ్చని గుంటుపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్, స్పెషల్ ఆఫీసర్ కె సరళ కుమారి తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు ధరకాస్తులు చేసుకోవాలని కోరారు. నిబంధనలకు లోబడి సీట్ల భర్తీ ఉంటుందని తెలిపారు. బాలికలలకు ఉన్నతమైన చదువులు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కస్తూరిభా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలకు లోబడి నడుస్తున్న విద్యాసంస్థల్లో ప్రవేశానికి దరకాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌లోగాని, తమను గాని సంప్రదించాలని కోరారు.

చెత్త బాక్సులు పంపిణీ చేస్తున్న సర్పంచి కృష్ణమోహన్

చెత్తసేకరణ డబ్బాలు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తోకలవానిపాలెంలో పొడి చెత్త, తడి చెత్త సేకరణ డబ్బాలను సర్పంచ్ టీ కృష్ణమోహన్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టుపక్కల పరిసరాలు శుభ్రముగా ఉన్నప్పుడే ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. ప్రజలు తమ ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటారో పంచాయతీ పరిసరాలు, రోడ్లు శుభ్రంగా ఉంటేనే గ్రామాల్లోని ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ గుమస్తా వి కోటేశ్వరావు, పంచాయతీ వర్కర్స్ వి రమేష్, జంగం శాంసోన్ పాల్గొన్నారు.

టిడిపి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఆనందబాబు

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - వేమూరు

టిడిపి, జనసేన సమన్వయ కమిటీల సమావేశం శుక్రవారం నిర్వహించారు. టిడిపి అధ్యక్షులు జొన్నలగడ్డ విజయబాబు ఆధ్వర్యంలో మాజీ మంత్రి, టిడిపి వేమూరు నియోజకవర్గ అభ్యర్థి నక్కా ఆనందబాబు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో టిడిపి రాష్ట్రంలో విజయ డంకా మోగిస్తుందని అన్నారు. అప్పటి వరకు నాయకులు, కార్యకర్తలు విశ్రాంతి లేకుండా పని చేయాల్సిన బాధ్యత ఉందని అన్నారు. వైసీపీ అరాచక పాలన నుండి విముక్తి పొందటానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ముఖ్య మంత్రిగా చంద్రబాబును గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. పెరవల, పెరవల్లిపాలెం గ్రామం నుంచి పలువురు వైసీపీ నాయకులు టిడిపిలో చేరారు. వీరికి టిడిపి కండువా కప్పి ఆనందబాబు ఆహ్వానించారు.

పరీక్షా సామాగ్రి అందిస్తున్న హెచ్‌ఎం జయ కుమార్

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల

ఉన్నత పాఠశాల విద్యలో అత్యంత కీలకమైన పదోతరగతి పరీక్షలకు విద్యార్థులకు అవసరమైన పరీక్షా సామాగ్రిని అందజేసి ప్రోత్సహించాలని హెచ్‌ఎం జయకుమార్ అన్నారు. మండలంలోని వెదుళ్ళపల్లి కిండర్ హిల్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జెడ్‌పి హై స్కూల్, బధిరుల ఆశ్రమ పాఠశాల, వివేక విద్యా ఆశ్రమం హై స్కూల్ పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని శుక్రవారం అందజేశారు. 205మంది విద్యార్థులకు అందజేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పదోతరగతి ఫలితాలే జీవితంలో దిశా నిర్ధేశం ఏస్తాయని అన్నారు. అలాంటి పరీక్షలను పట్టుదలతో రాయి ఉన్నతమైన మార్కులతో పాఠశాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నాయుడు సుబ్బారెడ్డి, కిండర్ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
శనివారం 16 మార్చి 2024

టిడిపి అధికారంలోకి వస్తే..

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

టిడిపి ఇన్‌ఛార్జి బిఎన్.విజయ్‌కుమార్

ప్రచారం చేస్తున్న విజయ్‌కుమార్

ప్రజాశక్తి-చీమకుర్తి

టిడిపి గెలుపుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని సంతనూతలపాడు టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంతనూతలపాడు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు. శుక్రవారం రాత్రి మండలంలోని కెవిపాలెంలో జరిగిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని.. ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో నంబర్ వన్‌గా అయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి టిడిపి అధికారంలోకి వచ్చాక చేపట్టే పథకాల గురించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు అడకా స్వాములు, జిల్లా నాయకులు మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మయ్య, గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, మండల సర్పంచ్ బక్కా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నల్లూరి వెంకటసుబ్బయ్య, మండల నాయకులు పుట్టా బ్రహ్మయ్య, యర్రగుంట్ల శ్రీను, పమిడి హరిబాబు, వేమా చినకోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

విద్యాసామగ్రిని అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలంలోని పాత శింగరాయకొండ గ్రామ పంచాయతీలోని తాతయ్య కాలనీలోని విద్యార్థులకు శింగరాయకొండ లోని స్మార్ట్ జెన్ గ్లోబల్ స్కూల్ వారి ఆధ్వర్యంలో పుస్తకాలు పెన్నులు, ఇతర విద్యా సామగ్రిని శుక్రవారం అందజేశారు. స్కూలు యాజమాన్య దంపతులైన చైర్మన్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ డాక్టర్ గీతారాణి విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు.

బియ్యం ధరలకు రెక్కలు

- 26 కేజీల సన్న బియ్యం బస్తా రూ.1400 పైనే..
- ధరల నియంత్రణకు చొరవ శూన్యం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బియ్యం ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ధరలు రోజు రోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. గడిచిన నెల వ్యవధిలో పది శాతం పైగా బియ్యం ధరలు పెరిగాయి. మధ్య తరగతి, ఆపై వర్గాల వారు సన్న బియ్యంపై మొగ్గు చూపిస్తుండడంతో రకరకాల పేర్లతో వ్యాపారులు బియ్యం ధరలను పెంచేస్తున్నారు. సామాన్యులు, చిరు ద్యోగులు, వివిధ రకాల వృత్తులపై ఆధార పడిన వారు పెరుగుతున్న బియ్యం ధరలను భరించలేకపోతున్నారు.

పెరిగిన ధరలు ఇలా..

గతంలో సన్న రకం బియ్యం వెరైటీని బట్టి 26 కేజీల బస్తా రూ.1,150 నుంచి రూ.1,300 వరకు ఉండేది. ఇప్పుడు ఆ ధర రూ.1,400 నుంచి రూ.1,650 వరకు పెరిగింది. గత ఆరు నెలల్లో రూ.250 నుంచి రూ.350 వరకు ధరలు పెరిగాయి. ప్రభుత్వం నుంచి లైసెన్సు పొంది జిఎస్టి పరిధిలో ఉంటూ హోల్‌సేల్ డీలర్లు, ట్రేడర్లు బియ్యం ధరలను విచ్చలవిడిగా పెంచుతుంటే సివిల్ సప్లయిస్ అధికారులు నియంత్రించలేకపోతున్నారు. బియ్యం ధరలు కేజీ ఒక్కింటికి రూ.45 నుంచి రూ.60 వరకు ఉన్నాయి. సన్నరకం, హెచ్‌ఎంటి, స్టీమ్ రకరకాల పేర్లతో బియ్యం ధరలను పెంచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్నాయంటూ కొన్ని రకాల బియ్యం ధరలను మరింత పెంచుతున్నారు. బియ్యం సంచులపై వివిధ రకాల బ్రాండ్ పేర్లు చూపించి సూపర్ ఫైన్ రకం అంటూ 26 కేజీల బస్తా రూ.1,400 నుంచి రూ.1,650కి వ్యాపారులు అమ్ముతున్నారు.

ధరల నియంత్రణ ఏదీ?

అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతున్న బియ్యం ధరలను చూసి ప్రజలు ఆందోళన చెందుతుంటే సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని గతంలో మిల్లింగ్ చేయించి బియ్యాన్ని వినియోగించేకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అధిక శాతం రైతులు తమ ధాన్యాన్ని పూర్తిగా అమ్మేసి సన్న బియ్యం కొనుగోలు చేస్తున్నారు. దీంతో మార్కెట్లో బియ్యానికి డిమాండ్ పెరిగింది. వినియోగదారులు పెరగటంతో ధరలు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత రేషన్ బియ్యం వినియోగదారుల నుంచి బహిరంగ మార్కెట్లోకి చేరుకుంటోంది. ఎక్కువ శాతం మంది ఉచిత బియ్యాన్ని కేజీ రూ.15 నుంచి రూ.18లకు వ్యాపారులకు అమ్మేస్తున్నారు. దీంతో సన్న బియ్యం, మధ్య రకం బియ్యానికి మార్కెట్లో డిమాండ్ ఏర్పడి ధరలు పెరుగుతున్నాయి. ధరలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

టిడిపిలోకి ఆహ్వానిస్తున్న దామచర్ల

టిడిపిలో చేరిన వైసిపి నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వైసిపి నుంచి టిడిపిలోకి శుక్రవారం పలువురు చేరారు. ఒంగోలు నగరం 21వ డివిజన్‌కు చెందిన వైసిపి నాయకులు గాలి శ్రీకాంత్, మెట్ల రామకృష్ణ, విశ్రాంత తహశీల్దార్ మెర్ని కుమారి, పాలేటి రాజారావు, పల్లె ప్రశాంత్, మద్దెల శివ సాయి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారితో పాటు సుమారుగా 90 మంది చేరగా వారికి జనార్దనరావు కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

పరీక్ష సామగ్రితో విద్యార్థులు

మండలంలోని దేవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఎ.గిరిబాబు, ప్రధానోపాధ్యాయులు భాస్కరశాస్త్రి ద్వారా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎ.గిరిబాబు మాట్లాడుతూ టిడిపి బోర్డు డైరెక్టర్ శిద్దా సుధీర్‌కుమార్, శృతి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాది మండలంలో పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దాహం కేకలు

- ఉపయోగపడని వాటర్ స్కీములు..
- అలంకారప్రాయంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు..

ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలంలోని గ్రామాల్లో వేసవి పూర్తిగా రాకముందే దాహం కేకలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో ఉన్న డీప్‌బోర్లన్నీ ఒట్టిపోయాయి. చెరువులను నింపిన సాగర్ జలాలు అడుగంటాయి. గత నెల ఒకటో తేది నుంచి ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం నిలిపివేసింది. దీంతో గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా త్రిపురాంతకం, ఒడ్డుపాలెం, పాపన్నపాలెం, ముడివేముల, గుట్లపల్లి, వెంగాయపాలెం గ్రామాలకు సాగర్ నీటి సౌకర్యమే లేదు. దీంతో ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. ప్రత్యేకంగా నీళ్ల కోసమే కుటుంబానికి ఒక మనిషిని కేటాయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యం పొలం బాట పట్టి త్రీఫేజ్ కరెంటు వచ్చిందాకా పొలాల్లోనే గడిపి పొలం యజమానులు వ్యవసాయ బోరు ఆడిస్తే అప్పుడు ఆయన దయా దాక్షిణ్యం మీద నీళ్లు పట్టుకొని ఇళ్లకు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నిరుపయోగంగా మారిన ఓవర్‌హెడ్ ట్యాంకు

అలంకారప్రాయంగా ఓవర్‌హెడ్ ట్యాంకులు..

ప్రతి గ్రామంలోనూ రూ. 15 నుంచి రూ. 20 లక్షలు వ్యయంతో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి ఉన్నారు. అయితే అవి దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయే తప్పా ఒక్కరోజూ కూడా ఆ ట్యాంకుల ద్వారా చుక్కనీరు సరఫరా కాలేదు. ఆర్భాటంగా స్కీములు ఏర్పాటు చేసి ఓవర్ హెడ్ ట్యాంకుకు అనుసంధానంగా గ్రామానికి రెండు బోర్లు ఏర్పాటు చేసి కాంట్రాక్టర్లు, అధికారులు కలిసి నిధులైతే దిగమింగారు కానీ ఒక్కరోజు కూడా ఆ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయలేదు. ఇదిలా ఉండగా వేసిన బోర్లలో సైతం మోటార్లు, పైపులు తొలగించుకొని అప్పనంగా అమ్ముకున్నారన్న ఆరోపణలు సైతం బలంగానే ఉన్నాయి.

ఉపయోగపడని వాటర్ స్కీములు..

సాగర్ కాలువకు అనుసంధానంగా దూపాడు ప్రాజెక్టు, లక్ష్మీపురం ప్రాజెక్టు, నడిగడ్డ ప్రాజెక్టులు ఏర్పాటు చేసినా ఆ ప్రాజెక్టుల పరిధిలో పట్టుమని పది గ్రామాలకు కూడా సాగర్ నీరు అందడం లేదు. దీంతో స్కీములన్నీ త్రిపురాంతకం మండలం నుంచే ఇతర మండలాలకు నీటిని పంపించి వేస్తున్నా ఆ మండలానికి మాత్రం నీటి సమస్యను పరిష్కరించకపోవడం పట్ల ప్రజలు విస్మయం చెందుతున్నారు.

కాగితాలకే పరిమితమైన జలజీవన్ పనులు..

ప్రతి గ్రామానికి జలజీవన్ మిషన్ ద్వారా రూ. 80 లక్షలు నుంచి గ్రామాన్ని బట్టి రూ. కోటిన్నర వరకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల ద్వారా ప్రతి గ్రామంలో బోర్లు వేసి బోర్లకు అనుసంధానంగా పైపులైన్లు ఏర్పాటు చేసి ఇంటింటికి కుళాయి సౌకర్యం కల్పించి మంచినీటిని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం, అయితే లక్ష్యం బాగున్నా ఆ ప్రభుత్వ పథకం మాత్రం పక్కదారి పట్టింది. కేవలం కాగితాలే పరిమితమైంది. కొన్ని గ్రామాల్లో మాత్రం పాతబోర్లు, పైపులైన్లకే నీటి కుళాయిలు బిగించి మామ అనిపించారు. బిల్లులు మార్చుకున్నారు. ప్రజలకు మాత్రం నీటి కష్టాలు తప్పు లేదు. నీటి కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నీళ్లు లేక అవస్థలు పడుతున్నాం

నాగమల్లేశ్వరి, త్రిపురాంతకం

నీళ్లు లేక అవస్థలు పడుతున్నాం. రెండు రోజులకు ఒకసారి స్నానం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం పనులకు వెళ్తే తాము వచ్చే అరకొర నీళ్లను సైతం తెచ్చుకోలేకపోతున్నాం. నీటి కోసం ధర్నాలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. నీటి సమస్యను పరిష్కరించాలి.

ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి

షేక్ కరిమున్, మేడపి

గ్రామాల్లో ప్రజల నీటి కష్టాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా నీటిని తోలాలి, వేసవికి ముందే పరిస్థితి ఇలా ఉంటే ఉంటే మే నెల వచ్చిందంటే మరిన్ని ఇబ్బందులు తప్పవు. ప్రభుత్వం పట్టించుకోకుంటే బతుకు దెరువు కోసం వలసలు పోతున్నట్లే నీళ్ల కోసం కూడా వలసలు పోవాల్సి వస్తోంది.

పాఠశాలకు సిమెంటు బెంచ్ బహూకరించిన దృశ్యం

సిమెంట్ బల్లలు బహూకరణ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని నూజిళ్ళపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన కేమా లక్ష్మీనారాయణ మూడు సిమెంట్ బెంచిలను బహూకరించినట్లు పాఠశాల హెచ్ఎం కె వీరాంజనేయులు శుక్రవారం తెలిపారు. పమిడిపాడు గ్రామస్తుడైన లక్ష్మీ నారాయణ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో సాయి యోషిత గ్రానైట్స్ ను నిర్వహిస్తున్నాడు. ఆయన తండ్రి కేమా ఆంజనేయులు, తల్లి వెంకటరత్నం జ్ఞాపకార్థం రూ.12వేల విలువచేసే సిమెంట్ బల్లలను అందించినట్లు చెప్పారు.

విద్యార్థులతో వనమా రామకృష్ణారావు

ఆర్డినో ప్రాజెక్ట్‌పై వర్క్‌షాపు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల్లో బి టెక్ విద్యార్థులకు ఆర్డినో ప్రాజెక్ట్స్ పై మూడు రోజుల వర్క్ షాపును ప్రారంభించినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ సహకారంతో సెబి టెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూటనికేషన్స్ విభాగంలో 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆర్డిఒ ప్రాజెక్ట్స్ మూడురోజుల వర్క్ షాపున ప్రారంభించినట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు మొయిద వేణు గోపాల రావు తెలిపారు. ఈ వర్క్ షాపునందు విద్యార్థులకు టింకర్ కార్డ్ సాఫ్ట్వేర్ ద్వారా ఆర్డినో ప్రాజెక్టుల అప్లికేషన్స్ను అవగాహన కల్పించి వాటి తయారిపై శిక్షణ ఇస్తారని ఇసిఇ విభాగాధిపతి కె జగదీష్ బాబు తెలిపారు. ఈ వర్క్ షాపునకు ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పోరేషన్ నుండి ఎం ఉమా మహేశ్వరరావు వివిధ అంశాలను వివరించారు. కార్యక్రమంనకు రమేష్ బాబు కన్వీనర్గా వ్యవహరించారు. వర్క్ షాపునందు ఇసిఇ విభాగ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకొల్లులో విచారణ చేపడుతున్న డిపిఓ రవి కుమార్

నిధుల దుర్వినియోగంపై విచారణ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఇటీవల ఇంకొల్లు పంచాయతి కార్యాలయంలో సర్పంచ్ పంచాయతి నిధులు దుర్వినియోగం చేశారని, వార్డు సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణపై జిల్లా పంచాయతి అధికారి రవికుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. వార్డు సభ్యులతో పాటు ఆ సమయంలో పని చేసిన పంచాయతి కార్యదర్శులను వివరణ కోరారు. సర్పంచ్ ఏజర్ల ప్రసన్నసమావేశానికి రాలేకపోతున్నానని రవికుమార్‌కు సమాచారం పంపారు. సుదీర్ఘంగా వార్డు సభ్యుల నుండి వివరాలు సేకరించారు. లిఖిత పూర్వకంగా నివేదికలు తీసుకున్నారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని రవికుమార్ వివరించారు. విచారణ సమయంలో ఆయన వెంట ఇఓ పిఆర్‌డి ఎ శ్రీనివాసరావు, ఇఓ కోటి నాగులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

స్వచ్ఛతకు నడుం బిగించని అధికారులు

ప్రజాశక్తి - రేపల్లె

ఎక్కడి చెత్త అక్కడే పేరుకపోయింది. రోజుల తరబడి చెత్త తీయకపోవడంతో కుళ్లి దుర్గంధం వెదజల్లుతుంది. పట్టణంలోని వివిధ వార్డుల్లో పారిశుధ్యం అధ్వన్నంగా తయారైంది. పరిసరాలు బాగుంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారు. ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అధికారుల కృషికి ప్రజలు సహకరిస్తేనే స్వచ్ఛత సాధ్యమవుతుంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. అధికారులు తమవంతుంగా ఎప్పటికప్పుడు మురుగు కాల్వల్లో పేరుకుపోయిన పూడికను తీయించడంతోపాటు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలి. అంతే విధిగా ప్రజలు సైతం ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలను పడేయకుండా చెత్తకుండిల్లోనే వేయాలి. అప్పుడు మనచుట్టున్న వాతావరణం ఆహ్లాదకరంగా మారి స్వచ్ఛమైన గాలిని అందిస్తుంది. కానీ పట్టణంలోని వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారై రోగాలకు కారకంగా మారుతోంది. పూడిక తీయకుండా వదిలేయడంతో మురుగునీరు రోడ్లపై పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా, అధికారులు మారుతున్నా డ్రైనేజీ, పారిశుధ్య సమస్య రూపురేఖలు మాత్రం మారడంలేదు. ఎక్కడి గొంగళి అక్కడే అన్నచందంగా ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయి కన్పిస్తున్నాయి. పట్టణంలోని 18. 19 వార్డులో వేపాలమ్మ చెరువు దగ్గరి వార్డుల్లో స్వచ్ఛత కరువైంది. చెత్తను రోడ్డుపైనే వేయడం వల్ల అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. డ్రైనేజీల్లోను చెత్త పేరుకు పోయి మురుగు నీరు డ్రైనేజీల్లో సక్రమంగా పారకుండా రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో దోమలు పెరిగి రోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 18, 19వ వార్డుల్లో స్వచ్ఛత పూర్తిగా కరువైంది. రోజురోజుకు దోమల బెడద అధికం అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వార్డుల్లో స్వచ్ఛతా కార్యక్రమాలను చేపట్టడంలో పురపాలక అధికారులు, ప్రజా ప్రతినిధులు పూర్తి నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వార్డుల్లో చెత్త తీయకుండా, డ్రైనేజీలను శుభ్రం చేయకుంటే తీవ్ర స్థాయిలో ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

రేపల్లె వీధుల్లో పేరుకపోయిన చెత్త

కాన్షీరాం సేవలు మరువలేనివి: బీఎస్పీ

ప్రజాశక్తి - చీరాల

బహుజనులుకు మాన్యశ్రీ కాన్షిరాం చేసిన సేవలు మరువ లేనివని బిఎస్పీ నాయకులు అన్నారు. బహుజన నాయకుడు మాన్యశ్రీ కాన్షిరాం 90 జయంతి సందర్భంగా స్థానిక గడియార స్తంభం కూడలిలోని కాన్షీరాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. మాన్యశ్రీ కాంక్షిరామ్ బహుజనుల కోసం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేసి బహుజనులను చైతన్యవంతం చేసి బహుజన సమాజ్ పార్టీని నిర్మాణం చేసి భారతదేశంలో అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌ను పాలించాడని అన్నారు. ఈ దేశంలో అంటరాని సమాజాన్ని రూపుమాపేందుకు గట్టి నినాదంతో తన జీవితాన్ని త్యాగం చేశాడని అన్నారు. ఆయన స్ఫూర్తిని బావి తరాలకు అందించాలని కోరారు. సెంట్రల్ జోన్ కోఆర్డినేటర్ జగన్మోహన్, సిర్రా భగత్ సింగ్, గొర్రె పాటి రవికుమార్, మండల మాజీ ఉపాధ్యక్షులు దుడ్డు భాస్కరరావు, రూప సుమ, బాజీ షరీఫ్, సంగీతరావు, పుల్లయ్య, డాని వంశి, రమణ, సుధాకర్, జోషి, పుల్లయ్య, జాన్, మాణిక్యరావు, కలాం, ఘోరె అంకయ్య పాల్గొన్నారు.

కాన్షిరాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

బస్టాండులో బేబీ ఫీడింగ్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

స్థానిక ఆర్టీసి బస్టాండ్ ఆవరణలో బేబీ ఫీడింగ్ రూమ్ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన వ్యాపారవేత్త పాలేరు రామకృష్ణ తన తండ్రి పాలేరు వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం అవసరమైన ఏర్పాట్లు చేశారు. 40 గ్రామాకు కూడలిగా ఉన్న ఇంకొల్లు బస్టాండ్‌కు ప్రయాణికుల సంఖ్య పెరిగింది. దీంతో ప్రయాణికులు పిల్లలకు పాలు ఇచ్చేందుకు కష్ట సాధ్యమైంది. తల్లుల ఇబ్బందులను గమనించిన ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు అన్నం బొట్ల మోహనకృష్ణ శాస్త్రి సమస్యను దాత దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో దాత రామకృష్ణ రు.లక్ష అంచనాతో గదిని నిర్మించేందుకు ముందుకు వచ్చారు. ఆర్టీసీ అధికారులకు అర్జీలు ఇవ్వడంతో పరిశీలించి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. దీంతో బస్టాండు ఆవరణలో బేబీ ఫీడింగ్ రూమ్ ఏర్పాటుకు ఆర్టీసీ ఇంజనీరు సుబ్బారావు మార్కింగ్ ఇచ్చారు. నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభించారు. ఈ గదిలో ఫ్యాను, మంచినీటి సౌకర్యం, లైటింగ్, తల్లి, బిడ్డతో కూర్చునే విధంగా చిన్న అరుగు నిర్మాణం వంటివి చేసి ఆర్టీసీ వారికి తన తండ్రి పేరు పెట్టి అప్పజెప్పే విధంగా అధికారులు అనుమతులు మంజూరు చేశారు. 10రోజుల్లో పూర్తిచేసి ఆర్టీసీకి అప్పజెప్పనున్నారు. కార్యక్రమంలో దాత పాలేరు రామకృష్ణ, లతీఫ్, అనంతరామయ్య, ఆర్టీసీ ఇంజనీరింగ్ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ఫీడింగ్ రూమ్ ఏర్పాటుకు పరిశీలిస్తున్న దృశ్యం

విద్యుత్ అక్రమ వాడకందారులపై చర్యలు

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలోని కారంచేడు గ్రామంలో విద్యుత్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 90మంది విద్యుత్ ఆక్రమ వినియోగదారులపై కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుండి రు.6.84లక్షల అపరాధ రుసుం విధించినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఒంగోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె వెంకటేశ్వర్లు, చీరాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాన్ థామస్, పర్చూరు డిఈఈ ఎన్ రమేష్ బాబు, చీరాల డీఈఈ శ్రీనివాసరావు, కారంచేడు ఎఈఈ రమేష్ బాబు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై అధికారుల సమీక్ష

పౌష్టిక ఆహారం పంపిణీ చేస్తున్న లక్ష్మి పద్మావతి

ఇతరులకు సాయపడాలి

ప్రజాశక్తి - చీరాల

ప్రతి ఒక్కరు నిరాశ్రయలకు సాయం అందించి మానవత్వం చాటుకోవాలని మాజీ మంత్రి జాగర్లమూడి లక్ష్మీపద్మావతి పేర్కొన్నారు. స్థానిక ఉడ్ నగర్‌కు చెందిన పోపూరి భూలక్ష్మీకుమారి జ్ఞాపకార్థం భర్త శ్యామసుందం రావు ఆర్థిక సహకారంతో మహిళా మండలి అధ్వర్యంలో 25 మంది హెచ్ఐవి రోగులకు రూ.8వేలు విలువగల పౌష్టికాహారం శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి చేయూత అందించి వారి జీవన మనుగడకు సహకరించాలని కోరారు. దాతలు మహిళలకు అందించిన సాయం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, పిడి శ్రీనివాసరెడ్డి, నాగేంద్రమ్మ, సిఒ, సభ్యులు పాల్గొన్నారు.

నూజిల్లపల్లిలో కవాతు చేస్తున్న బిఎస్ఎఫ్ సిబ్బంది

ఓటు హక్కును ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - పంగులూరు

రానున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును ఉపయోగించుకోవాలని సీఐ శివరామకృష్ణరెడ్డి కోరారు. ప్రజలు స్వేచ్ఛగా తమ అమూల్యమైన ఓటును నచ్చిన అభ్యర్థులకు వేసుకోవాలని సూచించారు. మండలంలోని నూజిల్లపల్లి, చందలూరు గ్రామాల్లో బిఎస్ఎఫ్ పోలీసు సిబ్బందితో కలిసి రూట్ మార్చ్ నిర్వహించారు. ప్రజల చేతిలో బలమైన ఆయుధం ఓటని అన్నారు. ఆ ఓటును శాంతియుత వాతావరణంలో ఉపయోగించుకోవాలని అన్నారు. మంచి అభ్యర్థిని ఎన్నుకోవటానికి ప్రజలు ఎలాంటి భయాలకు లోనవాల్సిన అవసరం లేదని అన్నారు. ఎవరి ఓటు వారే వేసుకోవాలని అన్నారు. ఎన్నికల్లో గ్రామాల్లో ఎలాంటి గొడవలు, ఆందోళనలు, దాడులు జరగకుండా ఉండేందుకు పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూడాలని అన్నారు. పోలీసు సిబ్బంది మార్చ్ పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు, హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు భట్టిప్రోలు, పల్లేకోన గ్రామాల్లో శుక్రవారం కేంద్ర సాయధ దళాలు కవాతు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బస్టాండ్ నుండి కవాతు నిర్వహించారు. అద్దేపల్లి, భట్టిప్రోలు రథం సెంటర్, రైల్వే గేట్ మీదగా తిరిగి బస్టాండు మీదగా పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలు సమీపించటంతో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా కేంద్ర బలగాలను ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. ప్రజలకు ఎన్నికల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అప్రమత్తం చేసేందుకు బిఎస్ఎఫ్ జవాన్లు కవాతు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రేపల్లె డిఎస్పి మురళీకృష్ణ, వేమూరు సిఐ కవాతును పర్యవేక్షించారు.

కవాతు నిర్వహిస్తున్న బిఎస్ఎఫ్ జవాన్లు

పారిశుధ్యం మెరుగుపర్చాలని ఆందోళన

• డంపింగ్ యార్డులుగా రహదారులు • దోమలు నియంత్రణ చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి -రేపల్లె

పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. ప్రధాన రహదారితో పాటు కళాశాలు, విద్యా సంస్థలకు వెళ్ళు రహదారుల వెంట కుళ్ళిపోయిన, కంపు కొడుతున్న చెత్తకుండీలు స్వాగతం పలుకుతున్నాయని జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ ఆరోపించారు. పట్టణంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై జనసేన, టిడిపి, బిజెపి ఆధ్వర్యంలో 28వార్డుల్లో పర్యటించారు. పారిశుధ్య సమస్యలను పరిష్కరించి దోమల నియంత్రణ చర్యలు తీసుకొని ప్రజారోగ్యాన్ని కాపాడాలని ఆందోళన శుక్రవారం ఆందోళన చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న కుండీలు చెత్తతో నిండిపోయి రోడ్లపై సగానికిపైగా పేరుకుపోయి డంపిగ్ యార్డులను తలపిస్తున్నాయని అన్నారు. అధికార వైసిపి పురపాలకులు పారిశుధ్యాన్ని గాలికి వదిలేసారని విమర్శించారు. పట్టణంలోని 28 వార్డుల్లో ఎక్కడ చూసినా పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందన్నారు. పారిశుధ్య దుర్గంధంతో

ఆందోళన చేస్తున్న జనసేన కార్యకర్తలు

పాటు ఈగల మాదిరిగా దోమలు ఇంటా, బయటా ఎక్కడ నిలబడినా గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణంలో దోమలు బెంబేలెత్తిస్తున్నాయి. పాలకులు దోమల నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపట్టక పోవటం సిగ్గుచేటు అన్నారు. సిద్ధం సభల పేరుతో రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న పాలకులు పట్టణ అభివృద్ధి, ప్రజారోగ్యం కొరకు ఏ మాత్రం శ్రద్ధ కనపర్చక పోవటం విచారకరమని అన్నారు. గతంలో పారిశుధ్య కార్మికులు ప్రతి రోజు డ్రైనేజీల్లో పేరుకు పోయిన మురుగు తొలగించేవారని ప్రస్తుత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు డ్రైనేజీల్లో మురుగు పేరుకు పోయిందన్నారు. గతంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి వార్డులో వారానికి రెండు పర్యాయంలు ఫాగింగ్ చేసేవారని, ప్రస్తుత పాలకులు వచ్చినప్పటి నుండి ఫాగింగ్ అనేది లేకపోవటంతో దోమలు ఈగల్లా మారి ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయని అన్నారు. అనంతరం పట్టణ పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతూ పురపాలక సంఘ కమిషనర్ శేషాద్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు మెండు సుబ్బారావు, గరికపాటి గిరిధర్, దేవగిరి శంకర్, మలిశెట్టి సాయి సురేష్ కె వంశీకృష్ణ, తోట లంకేష్, ఉపేంద్ర, రేపల్లె ఉషాద్రి, సాయి, మహేష్, రవి కందుల నాంచారయ్య పాల్గొన్నారు.

వెల్లటూరులో ప్రచారం చేస్తున్న నక్క అఖిల్

తనయుడి ప్రచారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు గ్రామంలో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా నక్కా ఆనందబాబును గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడు నక్క అఖిల్ శుక్రవారం ప్రచారం చేపట్టారు. ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన ఆరు పథకాలతో కూడిన మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రంలో గత ఐదు ఏళ్లుగా అభివృద్ధి కుంటు పడిందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగే విధంగా పాలనందించే చంద్రబాబును గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందని సూచించారు. ఆయన వెంట టిడిపి నాయకులు మోటూరు పుణ్య శ్రీనివాసరావు, నూతక్కి దినకర బాబు, ఎంపిటిసి వాక వెంకటనారాయణ, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమావేశంలో ఎంఎల్ఏ స్వామి, దామచర్ల సత్య

రాష్ట్రం కోసం టీడీపీ రావాలి

ప్రజాశక్తి - పొన్నలూరు

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని కొండపి ఎంఎల్ఏ డాక్టర్ డోల శ్రీ బాల వీరంజనేయ స్వామి అన్నారు. మండలంలోని జడ్ మేకపాడులో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన దామచర్ల సత్యతో కలిసి మాట్లాడారు. దామచర్ల సత్య మాట్లాడుతూ గత 30ఏళ్లుగా ప్రజలకు సేవ చేసుకునే అదృష్టం దామచర్ల కుటుంబానికి కల్పించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మేకపాడులో తెలుగు యువత నాయకులు కాటూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కాటూరి వెంకటేశ్వర్లు, ప్రస్తుత ఉప సర్పంచ్ పాపినేని ప్రసాద్, కాటూరి సుబ్బారావు, కాటూరి లక్ష్మీ నారాయణ, కాటూరి వెంకటేశ్వర్లు, కాటూరి గురవయ్య, కాటూరి ప్రసాద్, కాటూరి మాల్యాద్రితో పాటు 15కుటుంబాలు వైసీపీ నుండి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు భేరి పుల్లారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు, మాజీ అధ్యక్షులు మండవ ప్రసాద్, కర్నా కోటిరెడ్డి, పిల్లి వెంకట నారాయణరెడ్డి, నన్నమూరి నరసింహారావు, కాటూరి మాధవరావు, ఉన్నం బసవయ్య పాల్గొన్నారు.

'పోషణ పక్వాడా'తో పౌష్టికాహారం

అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ హిమబిందు

ప్రజాశక్తి - కారంచేడు

అంగన్‌వాడి పౌష్టికాహార పక్షోత్సవంలో భాగంగా మండలంలోని కుంకలమర్రు గ్రామంలో పోషణ పక్వాడ శుక్రవారం నిర్వహించారు. సుపోషన గురించి గర్భిణీలు, బాలింతలు నిత్యం తీసుకునే ఆహారంలో ఎలాంటి పోషక విలువలు ఉండాలో వివరించారు. అనారోగ్యం దరి చేరకుండా ఉండాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలనే వాటిపై వివరించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, రాగులు, సజ్జలు, జొన్నలు, సీజనల్ ఫ్రూట్స్ నిత్యం ఆహారంలో చేర్చుకోవాలని అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి ఇంటి వద్ద ఉన్న గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. అవసరమైన పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ హిమబిందు, అంగన్‌వాడీ కార్యకర్త ప్రసన్న, ఎఎన్ఎం ఆషా పాల్గొన్నారు.

చీరాల : పట్టణంలో ఐసిడిఎస్ సిబ్బంది పోషణ మాసోత్సవం శుక్రవారం నిర్వహించారు. పోషకాహారంతో తయారు చేసిన పిండి వంటలను ఎసిడిపిఒ కవిత పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి చిన్నారిని పోషక విలువలో పెంచేందుకు అనేక విలువైన పదార్థాలను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. చిన్నారి వయస్సుకు తగిన విధంగా ఎత్తు, బరువు ఉండాలంటే కచ్చితంగా సమపాలలో పోషకాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. పోషకాహార లోపం లేని సమాజాన్ని నిర్మించేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. జొన్నలు, సజ్జలు, రాగులు, అలసందలు, పచ్చ పెసలు వంటి పోషకాలు కలిగిన ఆహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని అన్నారు. సూపర్వైజర్ తబిత, మహిళా సంరక్షణ అధికారి హరిత, ఎఎన్ఎం లిల్లీ గ్రేస్, అంగన్‌వాడీ టీచర్స్ రేఖ, సులోచన, లత సంధ్య, ఉమా, అనిత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం వడ్డిస్తున్న కార్యకర్తలు

టిడిపి కేంద్ర కార్యాలయంలో చీరాల చేనేత ప్రతినిధులు

టిడిపి సీటు స్థానికులకే ఇవ్వాలి

అధిష్ఠానానికి చీరాల చేనేతల విజ్ఞప్తి

ప్రజాశక్తి - వేటపాలెం

టిడిపి సీటు స్థానికులకే కేటాయించాలని చీరాల చేనేత నాయకులు టిడిపి అధిష్ఠానానికి శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఆశావాహులైన మునగపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళగిరి టిడిపి కార్యాలయంలో రాష్ట్ర నాయకులను కలిశారు. చేనేతలకు మాత్రమే చీరాల సీటు కేటాయిస్తే జెండా ఎగరవేసి గిఫ్టుగా ఇస్తామని తెలిపారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆర్థికపరమైన అంశాలను సైతం పరిశీలించాలని కోరారు. చీరాలలో చేనేత వర్గానికి పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సజ్జ హేమలత, మాజీ జెడ్పిటిసి గుద్దంటి చంద్రమౌళి, యారాసు అరుణ్ బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఏ కరణం బలరామకృష్ణమూర్తి

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని తోటవారిపాలెంలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయం భవనాన్ని, రూ.3.55కోట్లతో గడిచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఎంఎల్ఏ కరణం బలరామ కృష్ణమూర్తి, వైసిపి ఇంచార్జ్ కరణం వెంకటేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఇ శేషయ్య, ఎంపీడీఓ శోభారాణి, వైసిపి మండల అధ్యక్షులు అసాది అంకాలరెడ్డి, ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మల్లెల లలితరాజశేఖర్, బండారు శివ పార్వతి, మాజీ వైస్ ఎంపీపీ నాదెండ్ల కోటేశ్వరరావు, డేగల వెంకటేశ్వర్లు, మచ్చా సువార్త, శీలం వెంకటేశ్వరమ్మ, షేక్ మస్తాన్, పాలపర్తి నాగేశ్వరరావు, డేగల కిషోర్, బిక్కా అద్దంకిరెడ్డి, బండారు జ్వాల పాల్గొన్నారు.

పాస్టర్ల సమావేశంలో బాలాజీ

సమావేశంలో వైసిపి ఇన్‌ఛార్జి యడం బాలాజీ

ప్రజాశక్తి - పర్చూరు

రాష్ట్రంలో క్రిస్టియన్ సోదరులకు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గౌరవం తెచ్చారని వైసిపి ఇంచార్జి యడం బాలాజీ అన్నారు. స్థానిక అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో జరిగిన దైవసేవకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పేదల కోసం జగన్మోహన్ రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ప్రతిపక్షాలు గెలిస్తే సంక్షేమ పథకాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. పేదవాడు బ్రతకాలన్నా, సంక్షేమ పథకాలు మళ్ళీ రావాలంటే జగన్మోహన్ రెడ్డి సిఎం కావాలని అన్నారు. తనను గెలిపిస్తే అందరికి అండగా అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో దైవసేవకులు డేవిడ్ మనోహర్, షాలేంరాజు, పూర్ణిమెట్ల జాన్ బాబు, జోసెఫ్, శాంతి బాబు, జీవన్ కుమార్, జాన్సన్ బాబు, మేరీ సోనియా, నాయకులు కోట శ్రీనివాసరావు, దాసరి వెంకట్రావ్, గాజుల రమేష్, ఆకుల హేమంత్ పాల్గొన్నారు.

యద్దనపూడి : మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామానికి చెందిన వైసిపి మండల నాయకుడు రావూరి వేణు బాబు నూతన గృహ ప్రవేశం శుక్రవారం జరిగింది. గృహ ప్రవేశానికి వైసిపి ఇంచార్జి యడం బాలాజీ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీనివాసరావు, బోస్, వెంకటరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

గృహప్రవేశానికి హాజరైన యడం బాలాజీ

పరీక్షలకు సంపూర్ణ ఏర్పాట్లు

ప్రజాశక్తి - సంతమాగులూరు

ఈనెల 18న జరిగే 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఒ వేమవరపు కోటేశ్వరరావు తెలిపారు. మండలంలో సంతమాగులూరు, ఏల్చూరు, మక్కెన వారిపాలెం, చవిటిపాలెం గ్రామాల్లోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సెంటర్ల నందు 693మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

'ఆమంచి' సమావేశం

ప్రజాశక్తి - వేటపాలెం

నేడో రేపు ఎన్నికల కోడ్ రానున్న సమయంలో మాజీ ఎంఎల్ఏ ఆమంచి కృష్ణమోహన్ తన అంతరంగికులతో శుక్రవారం రాత్రి పందిళ్ళపల్లిలోని తన గెస్ట్ హౌస్ వద్ద సమావేశం అయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఆయన సమావేశం ఉత్కంఠ రేపింది. అధికార వైసిపిలో ఉన్న ఆయన ఎలాంటి రాజకీయ నిర్ణయం తీసుకుంటారనే అంశంపై సర్వత్ర చర్చ జరుగుతుంది. దీంతో నిఘా వర్గాలు విషయం ఏమై ఉంటుందని అర్ధరాత్రి వరకు సమాచార సేకరణ పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమావేశానికి అతి కొద్ది మంది మాత్రమే హాజరైనట్లు సమాచారం.

కాగడాల ప్రదర్శనలో రైతులు

హామీలను మోడీ అమలు చేయాలి

రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

రైతులకు ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయనందుకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఇంకొల్లులో కాగడాల ప్రదర్శన శుక్రవారం నిర్వహించారు. ఢిల్లీలో రైతు ఉద్యమం ఏడాది పాటు జరిగిన సందర్భంలో హామీలను సాధించుకున్నప్పటికీ నేటికీ రైతాంగానికి ఇచ్చిన హామీలను మోడీ నెరవేర్చలేదని రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు విమర్శించారు. రైతులు తమ డిమాండ్ల సాధన కోసం తిరిగి ఉద్యమం చేయాల్సి వచ్చిందన్నారు. మోడీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కాగడాల ప్రదర్శనలో రైతు నాయకులు ఆదెయ్య, బాచిన కోటేశ్వరరావు, నాగండ్ల వెంకట్రావు, హనుమంతరావు, భానూప్రసాద్, నల్లపు రంగారావు, కసుకుర్తి గంగయ్య, లింఖన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చుపై అవగాహన అవసరం

రాజకీయ పార్టీలకు సూచించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తాము ఖర్చు చేయబోయే ఎన్నికల ఖర్చు విధి విధానాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్ కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో 6, 7, 8 ఓటర్ల క్లెయిమ్ ఫారాలకు సంబంధించి సుమారు 4వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరమే పరిష్కరించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలో తొలగింపులు సాధ్యపడవని, కేవలం చేర్పులకు మాత్రమే అవకాశం ఉంటుందని ఆ లోపుగా అలాంటి తొలగింపులు ఏవైనా ఉంటే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్లియర్ చేస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తరువాత పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పై, నామినేషన్ పత్రాల సమర్పించడం పై అవగాహన కల్పిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తాము ఖర్చు చేయబోయే ఎన్నికల ఖర్చు విధి విధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు వారి అభ్యర్థులు వారి ప్రచారానికి సంబంధించిన సమావేశాలు, ర్యాలీలకు సంబంధించి ఖర్చు పెట్టే వస్తువులు, సామాగ్రి, పరికరాలపై ధరలు నిర్ణయిస్తూ అందుకు సంబంధించిన రేటు కార్డు ప్రతులను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత, వైసిపి ప్రతినిధి డి. క్రాంతి కుమార్, బిజెపి ప్రతినిధి గుర్రం రాజశేఖర్, టిడిపి ప్రతినిధి స్వరూప్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిది ఎస్‌కె రసూల్ బాషా, సిపిఎం ప్రతినిధి బి. రఘురామ్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి సుదర్శన్, ఆర్ అండ్ బి ఎస్ఈ దేవదానం, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వ్యవసాయ రంగ అభివృద్ధికి

అధికారులందరూ కలిసి పనిచేయాలి

కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

ఖరీఫ్ సీజన్ లో పంటల సాగు విస్తరణకు అధికారులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన సమావేశం మందిరంలో జరిగింది. వ్యవసాయ రంగం అభివద్ధికి అధికారులందరూ కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. వేసవి లోనే ఖరీఫ్ పంటలకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. 25 మండలాలు, 410 ఆర్.బి.కె. స్థాయిలోనూ సమావేశాలు నిర్వహించాలన్నారు. వర్షాభావ పరిస్థితులను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. 15 రకాల పంటలు బాపట్ల జిల్లాలో సాగు చేస్తుంటే కొంతమేర సాగు విస్తరణ తగ్గిందన్నారు. ప్రస్తుతం రబీ సీజన్ లో 2.95 లక్షల ఎకరాలలో పంటలు సాగవుతున్నాయన్నారు. కోత దశకు వచ్చిన పంటలకు మద్దతు ధర కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెటింగ్ శాఖ కింద జిల్లాలో 43 గోదాములు నిర్మిస్తుండగా ప్రస్తుతం 23 గోదాములు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన వాటిని సత్వరమే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈక్రాప్ బుకింగ్ 98.91 శాతం నమోదయ్యిందన్నారు. ఈకేవైసీ ప్రక్రియ 95.56 శాతం నమోదుపై కలెక్టర్ ఆరా తీశారు.

మాట్లాడుతున్న కలెక్టర్

జె.పంగులూరు, కొల్లూరు, రేపల్లె మండలాలలో ఈకేవైసీ ప్రక్రియ జాప్యంపై సదరు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

బోర్ల కింద సాగు చేపట్టిన పంటలకు నష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జల వనరులు తగ్గుముఖం పట్టాయన్నారు. బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేసిన రైతులను ఆదుకోవాలన్నారు. మిగ్ జాం తుపాను సమయంలో రైతులకు నష్టం జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు చేసిన సేవలను ఆయన కొనియాడారు. తుపాను ప్రభావం ఉన్నప్పటికీ రైతులకు భారీగా నష్టం జరగకుండా వ్యవసాయ అధికారులు సమయస్ఫూర్తితో పనిచేశారని కితాబిచారు. ఆర్.బి.కె. సిబ్బంది నుంచి జిల్లా స్థాయి వరకు నష్ట అంచనాల సర్వే ప్రక్రియ వేగంగా చేపట్టారన్నారు. రైతులకు మేలు జరిగేలా అధికారులు కషి చేశారని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకష్ణ, డిడి విజయనిర్మల, ఉద్యానవన శాఖ ఏడి జెన్నమ్మ, ఏపీఎంఐపీ పీడీ వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన చెంచు కుటుంబాలు

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌ఛార్జి, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో అర్ధవీడు గ్రామ పంచాయతీలోని 25 చెంచు కుటుంబాల వారు మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లాకా రమణా యాదవ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి వారికి టిడిపి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీలో చేరిన నాగుల కొండమ్మ, నాగుల రాజు, దాసరి పెద్దక్క, ఉడుముల కొండయ్య, దాసరి గంగయ్య, గుర్రమ్మ, దాసరి లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, దాసరి కొండయ్య, నాగుల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

సిఏఏను రద్దు చేయాల్సిందే..

- ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి
- ప్రజాసంఘాల నిరసనలు

ప్రజాశక్తి-అద్దంకి

పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఏఏ) రద్దు చేయాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ముస్లిం సంఘాలు, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని భవానీ సెంటర్ నుండి బంగారు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రకాశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, సిపిఎం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పౌరసత్వ సవరణ చట్టంపై స్టే విధించాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించడం మంచి పరిణామమన్నారు. సిఏఏ వద్దని, తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేకుంటే ప్రతిఘటన తప్పదని పేర్కొన్నారు. సిఎఎ రాజ్యాంగ విరుద్ధమని, దేశ సమైక్యతకు ప్రమాదకరమని, ముస్లిం మైనారిటీలను వేధించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ సిఏఏ నిబంధనలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణంలోని ముస్లిం యువత నాయకులు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అద్దంకిలో నిరసన తెలుపుతున్న ముస్లిం, ప్రజాసంఘాల నాయకులు

మైనార్టీల ఉనికికి ప్రమాదం

రేపల్లె: ముస్లిం మైనార్టీల ఉనికికి ప్రమాదం తీసుకొచ్చే పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి మణిలాల్ డిమాండ్ చేశారు. రేపల్లె ఓల్డ్ టౌన్ పెద్ద మసీదు వద్ద సిఎఎని తక్షణమే వెనక్కి తీసుకోవాలంటూ సిపిఎం, లౌకిక పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం మణిలాల్ మాట్లాడుతూ మైనార్టీలను ఉద్ధరిస్తామని రోజూ ప్రకటనలు ఇచ్చే రాష్ట్రంలోని ప్రధాన రాజకీయపార్టీలు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. దేశంలో మైనార్టీలపై మెజార్టీ మతస్తులను రెచ్చగొట్టి ఉద్రిక్తతలను సష్టించాలనుకున్న బిజెపితో కలిసి తెలుగుదేశం లౌకికవాదం ఎలా కాపాడుతుందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి దురాగతాలను ప్రశ్నించకుండా వైసిపి మైనార్టీలను ఎలా రక్షిస్తుందో చెప్పాలన్నారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలపై దాడి చేస్తున్న సిఏఏ నోటిఫికేషన్‌ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని కోరుతూ లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదికగా దేశంలో ప్రజాస్వామ్యవాదులు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రేపల్లె పట్టణ నాయకులు కె.ఆశీర్వాదం, కెవి.లక్ష్మణరావు, బి.అగస్టీన్, వై.నవీన్, ఓల్డ్ టౌన్ మసీద్ ముస్లిం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

రేపల్లెలో సిఏఏకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న దృశ్యం

దామచర్లను కలిసిన కండే శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావును పిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ కండే శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక దామచర్ల కార్యాలయంలో దామచర్ల జనార్ధనరావును కలిసిన కండే శ్రీనివాసులు పుష్పగుచ్ఛమిచ్చి ఘనంగా సత్కరించారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ముఖ్య అనుచరుడుగా ఉండి మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో శనివారం ఉండవల్లిలో నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో మాగుంటతో పాటు కండే శ్రీనివాసులు టిడిపి తీర్థం పుచ్చుకోనున్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపి మాగుంటతో కలిసి దామచర్ల జనార్ధనరావుకి మద్దతుగా ఉంటానని తెలియజేశారు. త్వరలోనే త్రోవగుంటలో సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు. దామచర్ల కలిసిన వారిలో సెంట్రల్ స్టీల్ బోర్డు మాజీ సభ్యులు కెపిఎస్ రత్నరాజు, పాలేటి సురేంద్ర పాల్గొన్నారు.